## క్లుప్తంగా

### శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి కుంకుమ పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ చైర్మన్ అనంతాత్ముల బాలాజీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వ్యర్థాలతో అలంకరణ వస్తువులు



వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు

రాజానగరం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో వ్యర్థాలతో వివిధ రకాల అలంకరణ వస్తువులను తయారు చేయించారు. మట్టితో బొమ్మలు చేయడం, చిత్రలేఖనం వంటి వాటితోపాటు వ్యర్థాలతో ఉపయోగకరమైన వస్తువులను తయారు చేయడంలో అవసరమైన శిక్షణ కూడా ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎం శర్మ పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



పందలపాకలో క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు: పందలపాకలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జి.మామిడాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో ఇంటర్ విద్యార్థి పాలకపాటి దివ్య, పదో తరగతి విద్యార్థి జి.హేమశ్రీ కావ్య ఎంపికయ్యారని అన్నారు. విజేతలను పీడీ యువరాజరెడ్డి అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు జయకృష్ణారెడ్డి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మధురపూడి: అందరూ ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆయన ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ మండలంలోని గ్రామాల వారీగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతీ చోట ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### పంటలకు ఈ-కేవైసీ తప్పనిసరి

గోకవరం: ఈ-పంట నమోదు చేసుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ-కేవైసీ వేయని రైతులు పంట రుణాలు, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు పొందడానికి అనర్హులన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వారు పండించిన పంటను అమ్మడానికి కూడా అనర్హులన్నారు. ఈ-కేవైసీ నమోదు చేసుకోని రైతులంతా వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

### కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

మధురపూడి: కాంట్రాక్ట్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించడంపై ఏపీ పారామెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూళ్ల చటర్జీ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఉద్యోగులను కలవడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకురానున్నారన్నారు. ఈ మేరకు శాసనసభ, శాసన మండలిల్లో బిల్లు ఆమోదం పొందడంలో జగనన్న ప్రత్యేక శ్రద్ధ కనబర్చారన్నారు. దీంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ ఉద్యోగులంతా జీవితాంతం జగనన్న కు రుణ పడి ఉంటామన్నారు.

# ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష

- పురుగు మందులతో అప్రమత్తత
- పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి



పెదపూడిలో పంట పొలానికి పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: ఆరుగాలం శ్రమించి పంటను కంటికి రెప్పలా రైతన్నలు కాపాడుకుంటారు. సాగులో ఏ చిన్నపాటి సమస్య వచ్చినా పురుగు మందుల వాడకం తప్పనిసరి. ఈ క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారే అవకాశం లేకపోలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంటలలో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరిస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఇందులో అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2,776, బిక్కవోలులో 15,741 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. పంటకు పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు సరైన విధానాలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**రసాయనాలతో అనారోగ్య సమస్యలు**

పంటలను ఆశించే చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల ప్రభావంతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. వీటి వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, నరాల బలహీనత వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. మందుల పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకంతో వాటి అవశేషాలు పంటలపై చాలా కాలం ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతారని హెచ్చరిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ**

- మందుల పిచికారీ సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండే దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం భోజనం చేయరాదు. పిచికారీ మందు కోసం వాడే స్ప్రేయర్లు కండిషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి.
- పురుగు, తెగులు మందులను కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రతో కలపాలి.
- ఆహార పదార్థాలతో పాటు కీటక నాశక మందులను రవాణా చేయరాదు. పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా ప్రత్యేక గదిలో ఉంచాలి.
- గాలి వీచే దిశలోనే మందు ద్రావణం పిచికారీ చేయాలి.
- స్ప్రేయర్ల నాజిల్స్ శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదు.

**అప్రమత్తంగా ఉండాలి**



పురుగు మందు పిచికారీ చేసేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖానికి మాస్క్ ధరించాలి. ప్రత్యేక జాకెట్ వేసుకోవాలి. ఎరువులు, మందులు తగు మోతాదులో వినియోగించాలి. తెగులును గుర్తించి అవసరమైన మందులు మాత్రమే వినియోగించాలి.

–టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి

- ప్రమాదవశాత్తు మందు కళ్లలో పడితే వెంటనే మంచినీటితో శుభ్రం చేయాలి.
- కీటక నాశన మందుల డబ్బాలు ఖాళీ అయిన వెంటనే గొయ్యి తీసి అందులో పూడ్చి పెట్టాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరచుకోవాలి.
- ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగు మందుల వివరాలను డాక్టర్‌కు తెలియజేయాలి.
- పిచికారీ పూర్తయిన అనంతరం స్ప్రేయర్ల ట్యాంక్ బయట, లోపల శుభ్రంగా కడిగి వాటి భాగాలకు ఇంజిన్ ఆయిల్ పట్టించి జాగ్రత్త పరచాలి.

### 'నన్నయ' పీఆర్వోకు జాషువా పురస్కారం



ఆనంద్‌కు అభినందనలు తెలియజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీఆర్వోగా పనిచేస్తున్న పువ్వల ఆనంద్‌కి గుర్రం జాషువా పేరిట అందించే పురస్కారం లభించింది. జాషువా 128వ జయంతిని పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఈ పురస్కారాన్ని అందజేశారు. యూనివర్సిటీ పీఆర్వోగాను, జర్నలిస్టుగాను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు దుశ్శాలువాతో ఆనంద్‌ని మరోమారు సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

## ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

రాజానగరం: ఆరోగ్యం – పరిశుభ్రతపై కిశోర్ బాలికలు తగిన శ్రద్ధ తీసుకోవాలని, శరీరంలో వస్తున్న మార్పులపై పూర్తి అవగాహనతో మెలగాలని డాక్టర్ హేమనళినీ సూచించారు. దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్లకడియం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఆరోగ్యం-పరిశుభ్రత' పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. హెచ్ఎం కామేశ్వరరావు మాట్లాడుతూ కిశోర్ బాలికలను చైతన్యపరచడంలో ఫౌండేషన్ తీసుకుంటున్న శ్రద్ధను ప్రశంసించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూముల సమస్య పరిష్కారంపై హర్షం

**ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని సత్కరించిన రైతులు**



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న రైతులు

అనపర్తి: ల్యాండ్ సీలింగ్‌లో ఉన్న భూములను ఎల్‌సీసీ నుంచి తొలగించడం పట్ల సంబంధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. పొలమూరులో సుమారు 24 ఎకరాల భూమికి సంబంధించిన సర్వే నంబర్లు ఎల్‌సీసీలో నమోదయ్యాయి. దీంతో రైతులు తాము పడుతున్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. భూ యజమానులతో పాటు సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. అదేవిధంగా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే ఎల్‌సీసీలో ఉన్న ప్రజలందరూ వ్యవసాయ కూలీలని, వారికి తగిన న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత భూములను ఎల్‌సీసీ నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నాయకులు సత్తి వెంకటరెడ్డి, పొలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక సన్నిధిలో అన్నసమారాధనలు



బలభద్రపురంలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న ది లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆయా ఆలయాలు, ఉత్సవ మండపాల వద్ద శుక్రవారం అన్నసమారాధనలు జరిగాయి. బలభద్రపురంలో ది లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. పందలపాకలోని వినాయకనగర్ కాలనీ వద్ద అన్నదానం జరిగింది. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

**సంపత్ వినాయకుని సన్నిధిలో ఎమ్మెల్యే**

అనపర్తి: స్థానిక ధరణికోటలోని సంపత్ వినాయక స్వామివారి ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంపత్ వినాయకుని చేతిలో లడ్డూ ప్రసాదాన్ని వేలంలో శ్రీసాయి గౌతమ్ రెడీమేడ్స్ అధినేత ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి (సతీష్) రూ.27 వేలకు దక్కించుకున్నారు. ఈ ప్రసాదాన్ని ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా సతీష్‌కు అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, కమిటీ చైర్మన్ సతీష్, రామారెడ్డి, వెంకటరెడ్డి, పాలి అంజి, సక్కు, తమలంపూడి అమ్మిరెడ్డి, నాయకులు సత్తిబాబు, కొవ్వూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## సామాజిక కార్యక్రమాల్లో సొసైటీలు



బూరుగుపూడి సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ సత్తిబాబు

మధురపూడి: బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సామాజిక సేవాకార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందని చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం బూరుగుపూడి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ సంఘం రూ.18.50 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. ఇటీవల 100 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ, గుమ్ములూరుకు చెందిన వంకా రాణి అనే దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత వంటి సామాజిక సేవాకార్యక్రమాల నిర్వహణ సంతృప్తినిచ్చిందన్నారు. కరోనా సందర్భంగా రైతులనుంచి రావల్సిన 2 కోట్ల 30 లక్షల రూపాయలు వడ్డీ రావల్సిందన్నారు. ఇదేరోజు కోరుకొండ సొసైటీ చైర్ పర్సన్ మారిశెట్టి తేజో వీరన్నాయుడు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం రూ.47 కోట్ల టర్నోవర్‌తో ఉందని, 2023–24 సంవత్సరానికి గాను 15 కోట్ల రూపాయలు రుణాలివ్వాలనే ప్రతిపాదన చేశారు. సభ్యులు చప్పట్లతో ఆమోదం తెలిపారు. దోసకాయలపల్లి సొసైటీ సమావేశం చైర్ పర్సన్ గొల్లవిల్లి మురళి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశాల్లో సీఈఓలు ఈదల సుదర్శనరావు, జి.సుధాకరవర్మ, శివ, సొసైటీల పర్సన్లు జాజుల నాగేశ్వరరావు, అడపా రామకృష్ణ, నెక్కంటి అప్పారావు, గండిబోయిన రాజ్‌కుమార్‌లతో పాటు, రైతులు మేకా నెహ్రూరాజు, వంకా వీరన్న పాల్గొన్నారు.

### దంత వైద్య శిబిరం

అనపర్తి: స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళావేదిక ప్రాంగణంలో రాజానగరానికి చెందిన లెనోరా డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దంత సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న లెనోరా డెంటల్ కళాశాల యాజమాన్యాన్ని, వైద్యులను అభినందించారు. అనపర్తి, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, నాయకులు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, దంత వైద్యులు జబీరా బేగం, ఎస్.ప్రత్యూష, బి.మౌనిక, బి.సుశ్మిత, బి.ప్రశాంతి, ఎ.నేహా, లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు సత్కారం



రామేశ్వరంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న చినబాబు

పెదపూడి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సత్కరించడం ఆనందంగా ఉందని సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, పెద్దాడ సర్పంచ్ దొకుబుర్ర మీనాక్షి అన్నారు. రామేశ్వరం, పెద్దాడ, పెదపూడి గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కాఫీ విత్ క్లాప్ మిత్ర నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, సచివాలయ కార్యదర్శులు అచ్చిరాజు, త్రినాథ్, మన్యం శ్రీనివాసు చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



కృష్ణునిపాలెంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోకవరం ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ ఓ.శంకర్ సూచించారు. మండలంలోని కృష్ణునిపాలెంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కృష్ణునిపాలెంలో మూడు వేల జనాభాకు గాను 1578 మందిని స్క్రీనింగ్ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాత్విసుధ, పవన్, వేదకుమారి తదితరులు పాల్గొన్నారు.

**నేడు రంగంపేటలో వైద్య శిబిరం**

రంగంపేట: స్థానిక గ్రామ సచివాలయం–2 పరిధిలోని ఎంపీపీ పాఠశాల వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు తెలిపారు. దీనిపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ శిబిరానికి నలుగురు వైద్య నిపుణులు వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రామ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బలభద్రపురంలో గడప గడపకూ..



బలభద్రపురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకే పట్టంకట్టాలని పిలుపునిచ్చారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్ బుంగా రామారావు, మండల పార్టీ కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు మేడపాటి ఆనందరెడ్డి, చిన్నం వీరాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజానగరం నియోజకవర్గానికి ఆధ్యాత్మిక శోభ



చెక్కులను అందజేస్తున్న విజయలక్ష్మి

మధురపూడి: రాజానగరం నియోజకవర్గానికి ఆధ్యాత్మిక శోభ రానున్నట్టు, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 117 దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌లోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో మొదటి విడతగా 10 దేవాలయాలకు విడుదలయిన రూ.30,00,000 చెక్కులను ఆలయ కమిటీ చైర్మన్లు, నాయకులకు అందజేశారు. రాజానగరం మండలం తోకాడలోని శ్రీ రామాలయం, కోరుకొండ మండలం గాదరాడలోని శ్రీ సీతారామాలయం, కోరుకొండలోని శ్రీ కోదండ రామాలయం, మునగాల శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం, రాఘవపురం సీతారామాలయం, కోటి శ్రీ వీరదుర్గ ఆలయం తదితర ఆలయాల చైర్మన్లు, కమిటీ నాయకులకు చెక్కులను అందజేశారు.

## అంతర్ కళాశాలల క్రికెట్ జట్టు ఎంపిక



జట్టు ఎంపిక ప్రక్రియలో భాగంగా క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ కళాశాలల క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, పీడీ డి.సత్యనారాయణల పర్యవేక్షణలో శుక్రవారం జరిగింది. సుమారు 100 మంది క్రీడాకారులు హాజరు కాగా 15 మందిని ఎంపిక చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో జరిగే అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్లలో గైట్ డిగ్రీ కళాశాల నుంచి ఈ జట్టు పాల్గొంటుంది.

## రైతుల సంక్షేమానికి పెద్దపీట



సొసైటీ ప్రగతిని వివరిస్తున్న సీఈఓ దుర్గారావు

పెదపూడి: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మార్ని కామరాజుచౌదరి అన్నారు. స్థానిక సొసైటీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రగతిని సీఈఓ ఎం.దుర్గారావు వివరించారు. కామరాజు చౌదరి మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి గాను రూ.20.44 లక్షల లాభాలు వచ్చాయన్నారు. తమ సొసైటీలో రూ.10 కోట్ల టర్నోవర్ జరుగుతుందన్నారు. సొసైటీ డైరెక్టర్లు పందిరి సూర్యప్రకాష్, తోటకూర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### సామూహిక గణపతి పూజలు



రంగంపేటలో సామూహిక పూజలు చేస్తున్న విద్యార్థులు

రంగంపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రంగంపేటలో హనుమాన్ జంక్షన్ వినాయక ఆలయం వద్ద శుక్రవారం విద్యార్థులు సామూహిక గణపతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజ నిర్వహించారు. వీరికి తల్లిదండ్రులు సహకరించారు. అనంతరం ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు.